క్లుప్తంగా

బీటెక్ పరీక్షల పరిశీలన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డితో కలిసి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలను శుక్రవారం సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వీసీ వెంట అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక, డాక్టర్ ఆసిం ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

మహిళా బిల్లు ఆమోదించాలి

వరంగల్ అర్బన్: మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి కేంద్రం ఆమోదించాలని నగర మేయర్ గుండు సుధారాణి డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మేయర్ శుక్రవారం లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన ఎన్నికల హామీలను జాతీయ పార్టీలు తుంగలో తొక్కడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దీక్ష చేపట్టారని, ఈక్రమంలో ఆమెకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాలకు చెందిన పార్టీలు, మహిళా సంఘాలు నాయకులు, మేధావులు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

భద్రకాళి చెరువును పరిరక్షించాలి

హన్మకొండ అర్బన్: నగరంలోని భద్రకాళి చెరువు క్రమక్రమంగా కబ్జాదారుల ఆక్రమణకు గురవుతూ అన్యాక్రాంతమవుతోందని, ఈక్రమంలో చెరువును పరిరక్షించాలని తెలంగాణ భూములు, చెరువుల పరిరక్షణ కమిటీ చైర్మన్ పెరుమాండ్ల లక్ష్మణ్, పోతన వెంటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 849లోని 336 ఎకరాల్లో భద్రకాళి చెరువు ఉందని అన్నారు. అయితే, ఇప్పటికే 50 నుంచి 60 ఎకరాల వరకు శిఖం కబ్జాకు గురైందని పేర్కొన్నారు. వరంగల్‌లోని సంతోష్‌మాత గుడి, సాయినగర్ కాలనీల్లో కొంతమంది కబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు తెగబడుతున్నారని తెలిపారు.

పనిచేసినా.. డబ్బులు ఇవ్వడం లేదు

హసన్‌పర్తి: చేసిన పనికి నిధులు విడుదలైనా చెక్కు ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యురాలు బండారి రజిత ఆందోళన వ్యక్తం చేశారు. హసన్‌పర్తి మండలం సీతంపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సీడీఎఫ్ కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. గతేడాది అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టినట్లు ఎంపీటీసీ సభ్యురాలు పేర్కొన్నారు. అయితే, నెల రోజుల క్రితం అందుకు సంబంధించిన డబ్బులు పంచాయతీ ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. ఈక్రమంలో చెక్కు ఇవ్వడానికి సర్పంచ్ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయారు. ఈ విషయమై మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. ఇదిలా ఉండగా, తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ శరత్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండడం వల్ల చెక్కు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు.

సీఎంను కలిసిన 'నాగుర్ల'



హన్మకొండ: సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కలిశారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని హైదరాబాద్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించారు.

కేసీఆర్‌ను కలిసిన దర్శన్‌సింగ్



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన హనుమకొండలోని కాకతీయకాలనీకి చెందిన దర్శన్‌సింగ్.. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మైనారిటీ కమిషన్ సభ్యుడిగా తనను నియమించినందుకు కేసీఆర్‌కు దర్శన్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.

1,100 దళితబంధు యూనిట్లు

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లాకు రెండో విడత మరో 1,100 దళితబంధు యూనిట్లు మంజూరు కానున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం డిప్యూటీ డైరెక్టర్ డి.సురేశ్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడత జిల్లాకు 303 దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయని, మొత్తం గ్రౌండింగ్ కూడా పూర్తయిందన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు బుక్ కీపింగ్‌పై అవగాహన కోసం ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

జాతరకు ఏర్పాట్లు చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పుకోటలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో జాతరకు ఏర్పాట్లు చేయాలని స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ కోరారు. ఈమేరకు వరంగల్ మహానగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రావీణ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

మహిళా విద్యకు పాటుపడిన 'పూలే'

దళిత, బహుజన స్త్రీ జనోద్ధరణకు, మహిళా విద్యకు తన జీవితాన్ని సావిత్రిబాయి పూలే అంకితం చేశారని, సమాజంలో అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి మహిళా హక్కుల కోసం విశేష కృషి చేశారని పలువురు కొనియాడారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని నగర వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



కాశిబుగ్గ గుడిబడిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



శివనగర్‌లో సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, ఎస్ఐఎస్ఎఫ్ ప్రతినిధులు



కేయూలో పూలే దంపతులకు నివాళులర్పిస్తున్న పూలే ఆశయ సాధన సమితి బాధ్యులు



నిట్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓబీసీ ఎంప్లాయీస్ ప్రతినిధులు

మహిళా క్రీడోత్సవాలు ప్రారంభం

వరంగల్ అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో మహిళా క్రీడోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళా కార్పొరేటర్లు, వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, మెప్మా సిబ్బంది ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. టెన్నికాయిట్, క్యారమ్స్, జూడో, టగ్ ఆఫ్ వార్, వంటకాలు, మెహెందీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈనెల 13న ఇండోర్ స్టేడియంలో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కంటి వెలుగు, హెల్త్ క్యాంపు, 14న ముగింపు కార్యక్రమంలో భాగంగా విజేతలకు బహుమతుల ప్రదానం, సన్మాన కార్యక్రమం ఉంటుందని అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు పల్లం పద్మ, గుజ్జుల వసంత, అరుణకుమారి, గుండు చందన, బస్వరాజు శిరీష, విజయశ్రీ, సెక్రటరీ విజయలక్ష్మి, సూపరింటెండెంట్ ఆనంద్, ఏఈ సరిత, టీఎంసీ రమేష్, సీఓలు ప్రవీణ్, రజిత, రమ పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్‌లో కార్పొరేటర్లు, ఉద్యోగులు

సంప్రదాయాలపై అవగాహన కల్పించాలి



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్, సీఐ

వరంగల్: విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎండి.పుర్కాన్ సూచించారు. ఎల్‌బీనగర్‌లోని స్కాలర్స్ హైస్కూల్‌లో అబ్దుల్ కలాం సైన్స్ ఫెయిర్ అండ్ కల్చర్ హెరిటేజ్ ఎగ్జిబిషన్‌ను సీఐ గూడూరు సతీష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుర్కాన్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. స్కూల్ చైర్మన్ సంగ వెంకటరాజం మాట్లాడుతూ కరోనా కాలంలో విద్యార్థుల మానసిక స్థితి, విద్యా పరిణామాలు కొంత ఆందోళన కారణంగా ఉన్నప్పటికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల పట్టుదలతో విద్యార్థులను పూర్వ స్థితికి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సంఘ జీవనజ్యోతి, ప్రిన్సిపాల్ నాంపల్లి అశోక్, అకాడమిక్ ఇన్‌చార్జ్ సాజియా అంజుమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు ఘన సన్మానం

హన్మకొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని పారిశుద్ధ్య మహిళా కార్మికులను 51వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి రంజిత్‌రావు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గంగాదరి రాజు, యూత్ అధ్యక్షుడు బొంత రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు పగడాల సుమన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, శ్యామలరావు, మారేపల్లి జయపాల్, లత, గీత పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న రంజిత్‌రావు

సంక్షిప్తంగా

ఏకాగ్రత పెంపొందించుకోవాలి

ఖిలా వరంగల్: పరీక్షల సమయంలో విద్యార్థులు ఏకాగ్రతను పెంపొందించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రిన్సిపాల్ శోభాదేవి సూచించారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అధ్యాపకురాలు మైదం రూపారాణి ఆధ్వర్యంలో కళాశాల వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రణాళిక ప్రకారం చదివి విజయం సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి.

వన్ నేషన్.. వన్ రేషన్ వాల్‌పోస్టర్ల ఏర్పాటు

ఖిలా వరంగల్: జాతీయ ఆహార భద్రతా చట్టం కింద తెలంగాణ వినియోగదారుల వ్యవహారాలు, సరఫరాలు, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వన్ నేషన్.. వన్ రేషన్ వాల్‌పోస్టర్‌ను మండలంలోని రేషన్ షాపుల్లో ఏర్పాటు చేశారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

న్యూశాయంపేట: పరీక్షల సమయంలో విద్యార్థులను విద్యాసంస్థలు ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని అఖిల భారత విద్యార్థి సమైఖ్య హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల ప్రసన్నకుమార్ హెచ్చరించారు.

వరంగల్ కలెక్టరేట్ స్థల కేటాయింపుపై హర్షం

వరంగల్ చౌరస్తా: వరంగల్ సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి ఆజంజాహి మిల్లు మైదానంలో 27.8 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నరేందర్ చిత్రపటాలకు ఏజే మిల్ స్థలంలో శుక్రవారం పాలాభిషేకం చేశారు.

ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌గా మహేందర్

వరంగల్: ఏనుమాముల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వీఆర్‌లో ఉన్న ఎ.మహేందర్‌ను నియమిస్తూ సీపీ ఏవీ.రంగనాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏనుమాముల ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చేరాలు.. గత నెల 18నుంచి సెలవులో ఉన్నట్లు తెలిసింది.

బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్

రామన్నపేట: బహుజన సమాజ్‌పార్టీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పల్లపు మల్లికార్జున్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ తెలిపారు. అలాగే, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చిత్రపు పుష్పలతను నియమించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తి మృతి

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎస్ఎస్ఎం క్లబ్ మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ కథనం ప్రకారం నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బాషబోయిన రాజును శుక్రవారం సాయంత్రం ఢీకొట్టింది. దీంతో రాజు అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ప్రణయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మడికొండ: మడికొండ వడ్డెరకాలనీ సమీపంలో మెయిన్‌రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం ఎల్కతుర్తి గ్రామానికి చెందిన రమేష్.. బైక్‌పై వెళ్తుండగా వేరే వాహనం ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పట్టుబడిన 14మందిని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు ఇద్దరు శివరాత్రి సురేష్, మండల శ్రీధర్‌కు రెండు రోజులపాటు జైలుశిక్ష, 12 మందికి రూ.24వేల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు.

హోటల్‌లో చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట జంక్షన్‌లోని ఓ హోటల్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు కందికొండ జనార్దన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: మత సామరస్యానికి విఘాతం కల్పించిన ఐదుగురు ముస్లిం వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఒకపక్క దర్గా ఉర్సు ఉత్సవాలు, మరోపక్క మహంకాళి తల్లి బోనాలు జరుగుతుండగా తన్వీర్, జాకీర్, బషీర్, నజీర్, లతీఫ్ వేడుకలకు విఘాతం కల్పించారని సీఐ పేర్కొన్నారు.

నగరంలో నేడు.. రేపు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈనెల 11న నగర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వరంగల్‌లోని ఆజంజాహి మిల్స్, వరంగల్ స్టేషన్, ఖిలా వరంగల్, గొర్రెకుంట, శంభునిపేట, కరీమాబాద్, మామునూరు, ఏనుమాముల, దేశాయిపేట, పోతన సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే, హనుమకొండ నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు, పెద్దమ్మగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలో 8గంటల నుంచి 11గంటల వరకు, బాలసముద్రం, గోపాల్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, మడికొండ, రాంపూర్‌లలో ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు, వెస్ట్‌సిటీ, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కోమటిపల్లి, దేవన్నపేట, కోమటిపల్లి తండా, సుబ్బయ్యపల్లి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈనెల 12వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. పర్యాటక అభివృద్ధి సంస్థ, జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 85558 73700 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ కమిటీ ప్రమాణం

నయీంనగర్: ఈనెల 12వ తేదీన వరంగల్ జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం వరంగల్‌లోని శివనగర్ పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో జరుగుతుందని అధ్యక్షుడు వడ్డె యుగేందర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి హాజరవుతారని చెప్పారు. ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొల్లం రాజ్‌కుమార్, కోశాధికారి బండారి సదానందం, సోల రవి, బాలరాజు, సమ్మయ్య, అశోక్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆ నాలుగింటిని వదిలిపెట్టాలి

హసన్‌పర్తి: భయం, అహంకారం, సోమరితనం, నిర్లక్ష్యం అనే నాలుగు లక్షణాలను వదిలిపెట్టినట్లతే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుతారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు గాలి నరేందర్ సూచించారు. 65వ డివిజన్ సుబ్బయ్యపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో 'వ్యక్తిత్వ వికాసం'పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, మమత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌లో మోడల్ యునైటెడ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం మోడ్ యునైటెడ్ కార్యక్రమం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు పాటు కొనసాగనున్న కార్యక్రమాన్ని ఎస్సార్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జీఆర్ సీ.రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్లు సలావుద్దీన్, రాజేశ్వర్‌రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ గురురావు, డీన్ డాక్టర్ సయ్యద్ ముస్తాక్, పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న వీసీ జీఆర్‌సీ.రెడ్డి

జీ–20, వై–20పై అవగాహన అవసరం



కరీమాబాద్: మాట్లాడుతున్న శ్రీవత్స



సమ్మయ్యను సన్మానిస్తున్న ఎన్‌వైకే బాధ్యులు

కరీమాబాద్: జీ–20, వై–20లపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స కోట సూచించారు. తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అధ్యక్షత జరిగిన సమావేశంలో శ్రీవత్స మాట్లాడుతూ ఎన్‌వైఎల్‌పీ పథకం ద్వారా జిల్లా స్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జీ–20లో భాగంగా ఈ సంవత్సరం ఒకే భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు అనే అంశంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే, వై–20 అనేది జీ–20 కోసం అధికారిక యూత్ ఎంగేజ్‌మెంట్ గ్రూప్ అని వివరించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల ఫోరమని పేర్కొన్నారు. లీడ్ జిల్లా మేనేజర్ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నరసింహమూర్తి, జిల్లా యువత అధికారి అన్వేష్ పాల్గొన్నారు.

కేయూ ఫార్మసీ కళాశాలలో..

కేయూ క్యాంపస్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సమ్మయ్య సూచించారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో జిల్లాస్థాయి నైబర్ హుడ్ పార్లమెంట్ జీ–20, వై–20పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేయూ అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుసూదన్, నెహ్రూ యువ కేంద్రం అకౌంటెంట్ దేవిలాల్ మాట్లాడారు. అనంతరం, సమయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న చీఫ్‌విప్

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ న్యూశాయంపేటలోని దోనగుట్ట త్రివేదార్థి సంతోష లక్ష్మి నరసింహ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై శుక్రవారం ప్రతిష్ఠించారు. దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్, వేల్పుల మోహన్‌రావు, దేవాలయ అభివృద్ధి కమిటీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశ సంస్కృతిని గౌరవించాలి

- కేయూ వీసీ టి.రమేష్
- ఘనంగా ఎల్‌బీ కళాశాల 52వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కేయూ వీసీ రమేష్

రామన్నపేట: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, దేశభక్తి, సామాజిక విలువలు, చదువుతోపాటు దేశ సంస్కృతిని గౌరవించడం నేర్చుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి.రమేష్ అన్నారు. శుక్రవారం నగరంలోని లాల్ బహదూర్ కళాశాల 52వ వార్షికోత్సవాన్ని కళాశాల చైర్మన్ కె.నిరంజన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ రమేష్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన ఎల్‌బీ కళాశాల 52 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థుల ప్రతిభ , కళాశాల అధ్యాపకుల సేవలను కొనియాడారు. కాకతీయ యూనివర్సిటీకి ఎల్‌బీ కళాశాల గుండెకాయ లాంటిదని, ఎన్నో రంగాల్లో యూనివర్సిటీలతో పోటీ పడుతుందన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, టీఎస్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నేషనల్ కబడ్డీ ప్లేయర్ ఆర్.ప్రతాప్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు, సెక్రటరీ ఈ.రాజేందర్, కోశాధికారి బోళ్ల ఆనంద్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్, కల్చరల్ కన్వీనర్ కె.సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ కె.రాజేందర్‌రెడ్డి, ఎస్వీ రమణారెడ్డి, ఎం.సదానందం, సీహెచ్ రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినిమా, జానపద కళాకారుడు, కళాశాల పూర్వ విద్యార్థి జి.సంతోష్ ఆలపించిన పాటలు విద్యార్థుల్లో మంచి జోష్ నింపాయి. అనంతరం కళాశాల తరపున ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల్లో, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు, కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడా, సంస్కృతి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

భాగస్వాములు కావాలి

హసన్‌పర్తి: సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి జన్మదిన వేడుకలను జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్య, వైద్యానికి వాసవి క్లబ్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ ఆయా ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం, విద్యార్థులకు డిక్షనరీలు, నోట్ పుస్తకాలు అందజేశారు.

ఉపాధ్యాయులతోనే సమాజాభివృద్ధి



శంభునిపేట పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



కాజీపేట: బాలుర ఉన్నత పాఠశాలలో..

కరీమాబాద్: ఉపాధ్యాయులతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలవడ్డి రాజు అన్నారు. శంభునిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (టీఎంఈఎం)లో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే తోటి వారికి పాఠ్యాంశాలు బోధించారు. ఉపాధ్యాయులు సోల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, టి.సునీల్‌కుమార్, రాజు, పవిత్ర, సోమయ్య, ఉమారాణి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను కార్పొరేటర్ విజయశ్రీరజాలీ శుక్రవారం ప్రారంభించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం సుధాకర్ పాల్గొన్నారు.



హసన్‌పర్తి: ఉపాధ్యాయులతో విద్యార్థులు

హసన్‌పర్తిలో స్వయంపాలన దినోత్సవం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు తోటి వారికి పాఠ్యాంశాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.